# ట్రాక్టరును ఢీకొన్న బొలేరో

## యువకుడు దుర్మరణం



మృతుడు జగదీష్ (ఫైట్‌పోటో)

గంగవరం, ఆగస్టు 3, ప్రభాతవార్త:

గంగవరం మండలం మామడుగు సమీపంలోని గోశాల వద్ద సోమవారం రాత్రి ఓ ట్రాక్టర్‌ను బొలేరో వాహనం ఢీకొన్న సంఘటనలో జగదీష్ (23) దుర్మరణం చెందాడు. మామడుగు పంచాయతీ చెన్నారెడ్డపల్లెకు చెందిన జగదీష్ బొలేరో వాహనంలో పలమనేరు వైపు వస్తూ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలోకి ఇనుప సామాగ్రి దూసుకు వెళ్ళడంతో తీవ్రంగా గాయపడ్డ జగదీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్షకు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# తిరుపతి జిల్లాలో ఏపీటెట్‌కు సర్వం సిద్ధం

### 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు.. హాజరుకానున్న 11,391 మంది అభ్యర్థులు

### డీఈఓ కేవీఎన్ కుమార్



తిరుపతి విద్య, ఆగష్టు 3 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ టెట్)-2026 పరీక్షల నిర్వహణకు తిరుపతి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. ఆగస్టు 5 నుంచి 21వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో జిల్లాలో ఏపీ టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. తిరుపతి జిల్లాలో ఏపీ టెట్‌కు మొత్తం 11,391 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డీఈవో తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లాలో ఐదు కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఐఓఎన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్, మణిమంగళం, చెన్నై పరీక్షా కేంద్రంలో 117 మంది, ఐఓఎన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్, జూ పార్క్, తిరుపతి కేంద్రంలో 10,422 మంది, పీఎస్‌బీ పాలిటెక్నిక్ కళాశాల, చెన్నై కేంద్రంలో 302 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రంలో 1,105 మంది, శ్రీ జయరామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చెన్నై కేంద్రంలో 45 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని కేవీఎన్ కుమార్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో భద్రతా చర్యలు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగ అభ్యర్థుల కోసం వివిధ సెషన్లకు అనుగుణంగా 40 మంది సహాయకులను (స్క్రైబ్స్) ఏర్పాటు చేసినట్లు డీఈవో వెల్లడించారు. అభ్యర్థులు ముందుగానే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభ సమయానికి కనీసం రెండు గంటల ముందుగా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. ఏపీ టెట్ మార్గదర్శకాలను పాటిస్తూ పరీక్షల నిర్వహణకు సహకరించాలని అభ్యర్థులను కోరారు. ఏపీ టెట్ పరీక్షలను జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు.

# అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా స్వర్ణముఖి కరకట్టలు

### -వరుస సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు





శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆకతాయిలకుఅ డ్డుఆపు లేకుండా పోతుంది. పుణ్యక్షేత్రంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో పవిత్ర జీవనది స్వర్ణముఖి నది పడమర భాగంలో కరకట్టలను సుందరీకరణ పేరుతో గత ప్రభుత్వం(వైకాపా)లో తుడా నిధులు రూ.7కోట్లుతో ఆధునీకరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇక్కడ మరమ్మతులు చేపట్టారు. శివరాత్రికి ఇక్కడ నిధులు వెచ్చించినట్లు సమాచారం. అయితే ఇక్కడ రాత్రి వేళల్లో వీధిదీపాల్లేవు. దాంతో రెండు వైపు కరకట్టలు ఆకతాయిల ఆగడాలకు అడ్డాగా మారింది. మద్యం, గంజాయి బ్యాచ్‌లకు నిలయంగా మారింది. ఈ దారి వెంబడి వెళ్లె మహిళలపై పట్ల అసభ్యంగా ప్రవర్తించటం, దారిని వెళ్లె వారిని వేధించటం, నిత్యం ఇదో ఓపెన్ బార్‌గా మారిందని ఎన్ని సార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోక పోవటంతో నేడు హత్యకు దారి తీసింది. ముందుజాగ్రత్తగా పోలీసులు పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఉంటే కొంత వరకు కట్టడి జరిగి ఉండేది. ఈ కరకట్టలు ఆసాంఘీక కార్యక్రమాల అడ్డగా మారిందనడంలో సందేహం లేదు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం, ఈ దివ్యక్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు విఐపిలు వస్తుంటారు. ఒక నాడు ఈ పట్టణం ప్రశాంతతకు మారు పేరుగా, శాంతి భద్రతలు ఎంతో సజావుగా ఉండేది. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పరిపాలనలో రౌడీయిజం అనేది లేకుండా ఉండేది. అయితే ఐదేళ్ళ వైకాపా పాలనలో రౌడీమూకలు, అకతాయిల ఆగడాలకు హద్దు ఆదుపులేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు నిత్యం శాంతిభద్రతల గురించి, రౌడీయిజంను తుదముట్టించాలని సూచిస్తున్నారే తప్ప, ఆచరణలో అమలు జరగటం లేదు. ఈ కట్టలు మద్యం బాబులకు ఓపెన్ బార్‌లుగా మారాయి. పొద్దుగుంకితే ఈ మార్గంలో వెళ్ళాలంటే జనానికి భయంగా మారింది. సంబంధం లేకున్నా ఆకతాయిలు గంజాయి మత్తులో దాడికి పాల్పడం జరుగుతుంది. ఒక దశలో గతంలో ఇక్కడ పని చేసిన ఓ సిఐపై శవ ఊరేగింపులో గంజాయి బ్యాచ్ చేయి చేసుకున్న సంఘటనలతో ఆ శాఖ కుమిలి పోయింది, కానీ ఎవ్వరికి చెప్పుకోలేక పోయారు.

**శ్రీకాళహస్తిలో గంజాయి నియంత్రణలో విఫలం:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నాలుగు పోలీసు స్టేషన్లు కేంద్రీకృత మయ్యాయి. పరిపాలన సౌలభ్యంకోసం పట్టణ పరిధిని రెండుగా విభజించారు. వన్, టూ టౌన్‌లుగా విభజించారు. ఎన్నిగా విభజించినా ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో గంజాయి దొరుకుతున్నా పోలీసులు ఎందుకో శాశ్వతంగా మూలాలను కనిపెట్టి అదుపు చేయలేక పోతున్నారు. దొరికితే దొంగలు లేకుంటే దొరలన్నట్లు, గంజాయి బాబులు తమ వ్యాపారాలను సాగించుకుంటున్నారు. పొద్దుగుంకితే స్వర్ణముఖి కరకట్టలు దక్షిణ ఉత్తరాల్లో గంజాయి బ్యాచ్‌లు వీర విహారం చేస్తున్నారు. అయితే శాంతి భద్రతలంటూ పోలీసులు నాలుగుమాడా వీధుల్లో చూపుతున్న శ్రద్ధ, గంజాయి బ్యాచ్‌లు, మద్యం బాబులపై ఎందుకు దృష్టి సారించలేక పోతున్నారనేది ప్రశ్నార్థకం. అయితే పలుమార్లు స్థానిక శాసన సభ్యుడు గంజాయి బ్యాచ్‌లపై కఠినంగా వ్యవహారించాలని ఆదేశిస్తున్నా ఎందుకు పోలీసుల్లో స్పందన లేదనేది పట్టణంలో చర్చనీయింశంగా మారింది. శ్రీకాళహస్తి పట్టణాన్ని రెండుగా విభజిస్తున్న స్వర్ణముఖి నది కరకట్టలపై మున్సిపాలిటి వీధిదీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. సుందరీకరణ పేరుతో కోట్లు వెచ్చిస్తున్న పాలకులు ఇక్కడ సమస్యకు మూలమైన చీకటిని పారదోలే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తే కొంత వరకు ఆకతాయిలకు చెక్ పెట్టినట్లు అవుతుంది.

# శ్రీచెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేనే

### దొడ్డిదారిన అభివృద్ధి కమిటీ వేస్తే కోర్టుకెళ్తా

### - ఆర్వభూమి చంద్రశేఖర్ రెడ్డి



సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త:

శ్రీ చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఉండేందుకు వంశపారంపర్య ధర్మకర్తగా అన్ని అర్హతలు తనకే ఉన్నాయని గత కొంతకాలంగా కోర్టులో వంశపారంపర్య ధర్మకర్త అంటూ పోరాటం చేస్తున్న అర్వభూమి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కారిజాతలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం అభివృద్ధి కమిటీ అంటూ దొడ్డిదారిన శ్రీ చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై తనకు పూర్తి సమాచారం ఉందని ఒకవేళ అభివృద్ధి కమిటీని వేసినట్లయితే తాను కోర్టును ఆశ్రయిస్తానని అన్నారు. వంశపారంపర్య ధర్మకర్తగా తాను ఉండగా అభివృద్ధి కమిటీ వేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపారు. ఎంతోమంది పెద్దలు శ్రీ చెంగాళమ్మ దేవస్థానం చైర్మన్‌లు పనిచేసి దేవాలయ అభివృద్ధికి కృషి చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుతం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ప్రచారం ఉన్న తిరుమూరు సుధాకర్ రెడ్డి ఈ పదవికిగాని, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవికి గాని అన్ని విధాల అనర్హుడని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. ఆయన కారిజాత చెరువుకు నీటి సంఘం అధ్యక్షుడిగా ఉండి తిరిగి మరో పదవిని చేపట్టేందుకు ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. నీటి సంఘం అధ్యక్షునిగా ఆయనను ఎవరు ఎన్నుకోలేదని తనకు తానే నీటి సంఘం అధ్యక్షులుగా ప్రకటించి ఉన్నారని తెలిపారు. అలాగే తాను ట్రస్ట్ బోర్డు నియామకంపై కోర్టులో వేసి ఉన్న వాజ్యానికి సమాధానం చెప్పవలసిన దేవాదాయ శాఖ అధికారులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సుధాకర్ రెడ్డికి మద్దతుగా లక్షల రూపాయలు ఖర్చుపెట్టి తనకు వ్యతిరేకంగా కోర్టులో కేసులు నడిపిస్తున్నారని చెప్పారు. కోర్టు కేసులకే దేవస్థానం నిధులను ఖర్చుపెట్టె ఈ వ్యక్తి అభివృద్ధి కమిటీ పేరుతో చైర్మన్‌గా ఎంతవరకు అభివృద్ధి చేస్తాడు ప్రతి ఒక్కరు ఆలోచించవలసిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై తాను సమాచార చట్టం కింద అన్ని వివరాలు తెప్పించుకొని దేవాదాయ శాఖ అధికారులపై కేసు వేసేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ఇప్పటికే శ్రీ చెంగాళమ్మ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని రాజకీయ ప్రమేయం లేకుండా ట్రస్టు బోర్డు నియామకం జరగాలని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తానను చైర్మన్‌గా అంగీకరిస్తే త్రికరాణ శుద్ధిగాఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.

# అడ్మిన్ ఎఎస్పీగా మహబూబ్ బాషా బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

జిల్లా పోలీసు కార్యాలయంలోని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఛాంబర్‌లో సోమవారం అడ్మిన్ ఎఎస్పీగా మహబూబ్ భాషా బాధ్యతలు స్వీకరించారు. అడ్మిన్ ఎఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహబూబ్ భాషా మర్యాదపూర్వకంగా ఎస్పీ తుషార్ డూడిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మహబూబ్ భాష 1991 సంవత్సరంలో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరి అనంతపురం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. మహబూబ్ భాషా 2005 సంవత్సరంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొంది కడప సిఐడి విభాగంలో విధులు నిర్వర్తించారు. ఆపై మహబూబ్ భాషా 2014లో డిఎస్పీగా పదోన్నతి పొంది రాయచోటి, అనంతపురం ప్రాంతాల్లో డిఎస్పీగా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించారు. 2026 మే నెలలో డిఎస్పీలకు పదోన్నతులు లభించడంతో మహబూబ్ భాషాకు అడిషనల్ ఎఎస్పీగా పదోన్నతి లభించింది. మహబూబ్ భాషా అనంతపురం జిల్లా పోలీసు శాఖలో సేవలు అందిస్తున్న సమయంలో ఆయనకు ఎఎస్పీగా పదోన్నతి లభించి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు మహబూబ్ భాషా చిత్తూరు జిల్లా అడ్మిన్ ఎఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

# అనుమానంతో హతమార్చాడు

### మద్యం సేవించి భార్యపై దాడి.. ఆపై హత్య



తిరుపతి క్రైమ్, ఆగస్టు 3, ప్రభాతవార్త

భార్యపై అనుమానంతో హతమార్చిన సంఘటన తిరుపతి రూరల్ పరిధిలోని వెంకటపతినగర్‌లో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ మద్దయ్యాచారి సమాచారం మేరకు. తిరుపతి వెంకటపతినగరంలో భార్య భర్తలు సురేష్, గురవమ్మ (25) ఐదు సంవత్సరాలుగా నివసిస్తున్నారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. గత కొన్ని రోజులుగా భార్యపై అనుమానంతో ప్రతిరోజు మద్యం సేవించి దాడికి పాల్పడేవాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం యధావిధిగా మద్యం సేవించి భార్యపై దాడి చేశాడు. అనంతరం వంటగదిలోని సామగ్రితో తలపై దాడి చేయడంతో గురవమ్మకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలని రుయా ఆసుపత్రికి తరలించారు. తర్వాత ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. అనంతరం స్థానికులు ఆగ్రహంతో హత్యకు పాల్పడిన సురేష్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం గాయపడిన సురేష్‌ని పోలీసులు రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఊట్లవారిపల్లిలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు
రైతు బజారులో తక్కువ ధరలకు బియ్యం విక్రయాలు
8 లో

# సంస్కృత వర్సిటీ ఐక్యూఏసి డైరెక్టర్‌గా ప్రొ. నారాయణ్



తిరుపతి విద్య, ఆగష్టు 3 ప్రభాత వార్త

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ (ఐక్యూఏసి) డైరెక్టర్‌గా ద్వైత వేదాంత విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ నారాయణ్‌ను నియమిస్తూ విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయ చట్టం-2020, విశ్వవిద్యాలయ శాసనాలు, పరిపాలనా ఆర్డినెన్స్ నిబంధనల మేరకు గౌరవ ఉపకులపతి ఆమోదంతో ఈ నియామకం చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ప్రొఫెసర్ నారాయణ్ తక్షణమే బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాలపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఐక్యూఏసి డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. విశ్వవిద్యాలయంలో అంతర్గత నాణ్యత ప్రమాణాల నిర్వహణ, న్యాక్ గుర్తింపు ప్రక్రియలకు అవసరమైన ఏర్పాట్లు, విద్యా ప్రమాణాల సమీక్ష, విశ్వవిద్యాలయ ర్యాంకింగ్‌కు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణను ఆయన పర్యవేక్షి ంచనున్నారు. నూతన నియామకంతో విశ్వవిద్యాలయంలో నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు. ప్రొఫెసర్ నారాయణ్‌కు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని కోరారు.

# ఆర్ఎంపిలపై ప్రత్యేక నిఘా

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

జిల్లాలో ప్రస్తుతం ఆర్ఎంపిలుగా విధులు నిర్వహిస్తున్న వారిపై వైద్యాధికారులు ప్రత్యేక నిఘా వుంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం డిఎంహెచ్ఓ డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎంపిలు కేవలం ప్రథమ చికిత్స మాత్రం చేయాలని, సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. అలాగే రిజిస్టర్ కాని ప్రైవేటు ఆసుపత్రులు, లాబరేటరీలు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. లేని పక్షంలో వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాలపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. అలాగే రోగులకు వేగంగా సేవలు అందించేలా కెసిడి ప్రక్రియనఉ సక్రమంగా అమలు చేసి ఈ నెల 10 ఆపరేషన్ల లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ఆర్‌బిఎస్‌కె 2.0 స్క్రీనింగ్ స్కూల్స్, అంగన్‌వాడీల్లో నాణ్యత చేపట్టాలని, 4డి అనుమానితులను డాక్టర్‌కు రెఫర్ చేసి పరీక్షల అనంతరం డిఇఐసి నందు చికిత్స చేయించాలన్నారు. అలాగే మధుమేహం, బిపీ వంటి అసంక్రమణ వ్యాధుల కోసం స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలన్నారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి చేతుల మీదుగా అందించే అవార్డులకు సంజీవిని, కెసిడి నందు అప్‌డేట్ ఎక్కువగా వున్న పిహెచ్‌సి ఎఎన్ఎంలు, ఆశా, సిహెచ్‌సిలను సిఫార్సు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ గిరి, డాక్టర్ అనూష, జార్జి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సి డాక్టర్లకు డిఎంహెచ్ఓ డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి దిశా నిర్దేశం



# శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం గర్భగుడిపై వివాదం

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి ఆలయంలో ఉన్న గర్భగుడి నిర్మాణంపై వివాదం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ 9కోట్ల దాకా నిధులు మంజూరు చేసిన విషయం విదితమే. దీంతో ఆలయ పునర్నిర్మాణంకు ఇప్పటికే పలుమార్లు స్థపతి, దేవదాయ శాఖ అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. సోమవారం స్థపతి రావడంతో ఆలయ పునర్నిర్మాణంపై కొలతలు తీశారు. ప్రస్తుతం అమ్మవారి గర్భగుడి ప్రాంతాన్ని దక్షిణం వైపు జరిపి నిర్మాణాలు చేపడ్తామని స్తపతి, దేవదాయ అధికారులు పేర్కొనడంతో వివాదం మొదలైంది. పెద్ద ఎత్తున ఆలయ పూజారులు, భక్తులు ఆలయం వద్దకు చేరుకుని స్తపతి నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అమ్మవారి గర్భగుడిని ఎట్టిపరిస్థితుల్లోను మార్చరాదని అది మంచిది కాదని పేర్కొన్నారు. తాము ఆలయ అభివృద్ధికి వ్యతిరేక ం కాదని పేర్కొన్నారు. ఆలయ గర్భగుడి మార్చే అంశంపై ఎవరికి తెలియకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని స్థపతిని ప్రశ్నించారు. కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబులతో పూజారుల బృందం, భక్తులు మాట్లాడుతూ అమ్మవారి గర్భగుడి యధాస్థానంలోనే ఉండేలా మిగతా నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

# ఘనంగా శ్రీ కనకనాచమ్మ జాతర

### - పోటెత్తిన ఆంధ్ర..తమిళభక్తులు.. పొర్లుదండాలు పెట్టిన మహిళలు !!

### - దెయ్యాలు వదిలించేందుకై జనం బారులు !!



విశేషాలంకరణలో శ్రీ కనకనాచమ్మ అమ్మవారు, ఆలయంలో పొర్లుదండాలుపెడుతున్న మహిళలు

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

తమిళనాడు సరిహద్దుల్లోని కుప్పం మండలం నాయనూరు పంచాయతీ పెద్దవంక పాలారు నదీ తీరంలో వెలసిన శ్రీ కనకనాచమ్మ అమ్మవారి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈజాతరకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలనుంచి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయంలో వేపమండలాలతో పొర్లు దండాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఈసందర్భంగా విశేషంగా అలంకరించారు. రాత్రి వరకు భక్తుల తాకిడి ఆలయం వద్ద అధికంగా కన్పించింది. భక్తులు పాలారు నదిపై ఉన్న చెక్‌డ్యామ్ మీదుగా అమ్మవారి ఆలయంకు చేరుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కుప్పం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడిచాయి. జాతర సందర్భంగా పెద్దవంక గ్రామంలో కోలాహలం కన్పించింది. ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వివిధ రకాల దుకాణాలు ఏర్పాటుచేయడంతో సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. జాతర సందర్భంగా కుప్పం డిఎస్పీ పార్థసారథి అధ్వర్యంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ఎస్సైలు, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, స్థానిక నేతలు దర్శించుకున్నారు. భక్తులకు తెలుగుయువత అధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర సందర్భంగా మహిళలకు దెయ్యాలు వదిలించే కార్యక్రమంను జరిపారు.

# పేదలకు అందుబాటులో నాణ్యమైన బియ్యం

## - సన్న బియ్యం విక్రయాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త: పేదలకు అందుబాటులో నాణ్యమైన బియ్యం వుంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. చిత్తూరు రైతు బజార్‌లో తక్కువ ధరలకు సన్నరకం బియ్యం విక్రయాలను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పౌరసరఫరాల అధికారి లక్ష్మీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు భారం తగ్గించాలనే ఉద్దేశంతో సిఎం నారా చంద్రబాబునాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌లు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. మార్కెట్ ధరల కంటే కేజీకి రూ.10 వరకు రైతు బజారులో నాణ్యమైన సన్న బియ్యం వినియోగదారులకు అందుబాటులో వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్, తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలు కుమారి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కర్జాల అరుణ, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, కూటమి నాయకులు సురేంద్రకుమార్, సికె లావణ్య, అట్లూరి శ్రీనివాసులు, వెంకటేష్‌యాదవ్, అనురాధ, గిరి, నరేష్, ఈశ్వర్‌రావు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

## - యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలను డిఇఓ అకస్మిక తనిఖీ



యాదమరి, ఆగస్టు 3 ప్రభాతవార్త:

మార్చిలో నిర్వహించనున్న టెన్త్ పరీక్షల్లో ప్రస్తుతం టెన్త్ క్లాస్ చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిని ఉత్తమంగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. యాదమరి శ్రీపిఎం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం డిఇఓ లక్ష్మీనారాయణ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ లక్ష్మీనారాయణ పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల నిర్వహణ, బోధన విషయంలో కొన్ని లోపాలను గుర్తించి వాటిని సత్వరం సరిదిద్దుకోవాలని ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులతో డిఇఓ సమీక్షించారు. మార్చిలో జరుగనున్న టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం మరింత పెంచడానికి, మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రణాళికా బద్దంగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి హెచ్ఎల్ఎన్ ప్రసాద్, పాఠశాల హెడ్మాస్టర్ హేమలత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య రంగ భవిష్యత్తుకు నైపుణ్యాలే పునాది

## - అపోలో నాలెడ్జ్ సిఇఓ డాక్టర్ శివరామకృష్ణన్



చిత్తూరుహెల్త్, ఆగస్టు 3 ప్రభాతవార్త:

భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో నైపుణ్యాలు వున్న మానవ వనరుల కొరత తీవ్రంగా వుందని, ఆ లోటును భర్తీ చేసే దిశగా అపోలో హెల్త్‌కేర్ అకాడమీ కీలక పాత్ర పోషించనుందని అపోలో నాలెడ్జ్ సిఇఓ డాక్టర్ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్ అన్నారు. అపోలో హెల్త్‌కేర్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను అపోలో నాలెడ్జ్ సిఇఓ డాక్టర్ శివరామకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మానవ వనరులు సంవృద్ధిగా వున్నప్పటికీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలున్న సిబ్బంది కొరతే ప్రస్తుతం అతిపెద్ద సవాలుగా మారిందన్నారు. ఆరోగ్య విద్యలోను నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం వుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యసేవల స్వరూపం వేగంగా మారుతుందన్నారు. ఒకప్పుడు ఆసుపత్రులకు పరిమితమైన వైద్య సేవలు ఇప్పుడు ఇంటి వద్దకే విస్తరిస్తున్నాయన్నారు. మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కు భారీ డిమాండ్ వుందన్నారు. అనేక దేశాలు భారతదేశం నుండి నైపుణ్యాలు వున్న ఆరోగ్య సిబ్బందిని ఆశిస్తున్నాయన్నారు. ఈ అవసరంను ముందుగానే గుర్తించిన అపోలో హెల్త్‌కేర్ అకాడమీ ఆరోగ్య రంగానికి అవసరమైన నైపుణ్యాలు వున్న నిపుణులను తీర్చిదిద్దే బాధ్యతను చేపట్టిందన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగర్కర్ మాట్లాడుతూ సమాజం మారుతున్న కొద్ది విద్యార్థుల ఆలోచనా విధానం, నేర్చుకునే సామర్థ్యం మారుతుందన్నారు. అందుకు అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వనరులు నిపుణురాలు డాక్టర్ ప్రతిమ ఖండేల్వాల్, అపోలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె.ఆగస్టీన్, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్., ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్, దేశవ్యాప్తంగా అపోలో హెల్త్‌కేర్ అకాడమీకి చెందిన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

# కైలాసేశ్వర ఆలయ కుంభాభిషేకం



బంగారుపాళ్యం, ఆగస్టు 3 ప్రభాతవార్త:

మండలంలోని పాలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కనకాద్రి కైలాసేశ్వర ఆలయ కుంభాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. హిమాలయ పర్వతాల్లో రూపొందించిన స్ఫటిక లింగంను ఆలయంలో ప్రతిష్టించారు. కలశ స్థాపన, వాస్తు వాచకం, కలశ అరాధన, పూర్ణాహుతి, గణపతిహోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట నిర్వహించి గో పూజ, రుద్ర హోమం, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. గ్రామానికి చెందిన చెంగల్‌రెడ్డి ఈ ఆలయంను నిర్మించారు. ఈ పూజ కార్యక్రమాలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారిలు, మాజీ ఎంపి రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, పలురువు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి గ్రామస్తులు, అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం మాజీ మంత్రి పెద్దిరెడ్డి లింగాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# సమస్యల పరిష్కారంకు సత్వర చర్యలు

## - జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో డిఆర్ఓ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై 175 అర్జీలు అధికారులకు అందాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించి 127 వినతులు వుండగా డిఆర్‌డిఎ 27, పోలీసు శాఖ 7, రూరల్ వాటర్ సప్లై 1, ఇంజనీరింగ్ 1, ఎపిఎస్‌పిడిసిఎల్ 2, వ్యవసాయశాఖ 2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, సివిల్ సప్లై 1, పంచాయతీరాజ్ 1, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ నుండి ఒక అర్జీ అందాయి.

# పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 ఫిర్యాదులు



చిత్తూరుహెల్త్, ఆగస్టు 3 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం ప్రజల నుండి సమస్యలపై 41 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించిన ఎస్పీ సత్వరం సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు నాన్ కేడర్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షాను, చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణలు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 41 సమస్యలు ప్రజల నుండి అందగా ఇందులో భూ తగాదాలకు సంబంధించి 11, కుటుంబ తగాదాలు 10, చీటింగ్ 3, వేధింపులు 3, డబ్బు తగాదాలు 3, చిన్న గొడవలు 2, ఆస్తి తగాదాలు 6, పోలీసు సేవలు, బెదిరింపులు, దారి సమస్యలపై ఒకొక్క అర్జీ అందాయి.

# ఉర్దూ పాఠశాలలో రాధాకృష్ణన్ మిత్ర కిట్లు పంపిణీ

రామకుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

స్థానిక ఉర్దూ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ మిత్రకిట్లను టిడిపి ముస్లిం మైనార్టీ జిల్లా నేత సలాం సాబ్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఆదిల్ భాష పంపిణీ చేశారు. విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వ బడుల బలోపేతానికి, ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించేందుకు పునాది నుంచి మంచి విద్యాబోధనలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకంతో ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ చాంద్ బాషా, నీసార్, ఛైర్మన్ జుబేదా తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా పాల రేవుగడ్డలో ఆ డికృతిక



రామకుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని పాల రేవగడ్డలో నెలకొని ఉన్న శ్రీ వల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి (బాలమురుగన్) ఆలయంలో ఆ డికృతిక వేడుకలుకోలాహలంగాజరిగింది. సోమవారం ఉదయం పంచామృతాబి షేకం, వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయమంతా పచ్చ తోరణాలు విద్యుత్ దీపాలంకరణతో ఆలయాన్ని సుందరికరించారు. ఆంధ్ర ,కర్ణాటక, తమిళనాడు రాష్ట్ర కూడలి కావడంతో ఎంతో మహిమాన్విత ఆలయంగా ప్రసిద్ధి చెందింది. భక్తుల కోర్కెలను నెరవేరుస్తూ దినదినాభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ఏపీ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం ఆలయాన్ని సందర్శించి భక్తులకు అనవుగా ఉండేందుకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సాయంత్రం వీపు తేరు, నెమలి పేరు, పచ్చకావుళ్ళు, శరీరమంతా నిమ్మకాయలు గుచ్చుకొని తేరు లాగుకుంటూఆలయానికిచేరుకుని భక్తులు మొక్కలు తెరుచుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తాదులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన ప్రసాదాలు వితరణ చేశారు. స్థానిక పోలీసులు, ఆలయ పాలక మండలి సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

# రైతులకు ప్రభుత్వ సంక్షేమాలు వివరించండి

## ఎ ఏం సి ఛైర్మన్ జిఎం రాజు

రామకుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



మండలంలో పశువుల రైతులకు ప్రభుత్వ సంక్షేమాలను పశువుల వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో రైతులకు వివరించి సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. సోమవారం మినీ మార్కెట్ యార్డులో పశుసంవర్ధక, మార్కెట్ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పశువుల వైద్య సేవలో ప్రైవేట్ వ్యక్తుల మోజులో పడొద్దని ప్రభుత్వ పశు వైద్యుల సేవలు వినియోగించుకోవాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో పాడి రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేట్ కంపెనీలు ముందుకు వస్తున్న నేపథ్యంలో పాల ఉత్పత్తి పెంచి రైతులకు రెట్టింపు ఆదాయం అవుతుందన్నారు. పశువుల సంరక్షణకు క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించి రైతన్నలకు అన్ని విధాల సహాయ సహకారాలు కల్పిస్తామన్నారు. రామకుప్పంలో పాల ఉత్పత్తి మొదటి స్థానంలో వచ్చేలా అధికారులు కృషి చేయాలి అన్నారు. వ్యవసాయ అధికారులు, పశువైద్య అధికారులు సమన్వయం చేసుకొని రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ ఛైర్మన్ శరవణ, ఏఎంసీ డైరెక్టర్ పవన్ కుమార్, పశు వైద్యాధికారులు సతీష్ బాబు, జయశ్రీ, వ్యవసాయ అధికారి అమృత ,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## కమీషనర్ లోకేష్‌వర్మ

పలమనేరు, ఆగస్టు 3, ప్రభాతవార్త:




పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఇక నుండి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని కమీషర్ లోకేష్‌వర్మ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కమీషనర్‌కు విన్నవించారు. మొత్తం 15 వినతులను కమీషనర్ స్వీకరించారు. ఇందులో ప్రజా రోగ్యం 1, ఇంజనీరింగ్ విభాగం 9, టౌన్ ప్లానింగ్ 4, రెవిన్యూ విభాగం 1, వంతున వినతులు సమర్పించారు. ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తామని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని కమీషనర్ తెలిపారు. అలాగే వీధి కుక్కల నియంత్రణపై కూడా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పట్టుకున్న కుక్కలకు ఎబిసి, ఎఆర్‌వి ఎబిసి వ్యాక్సిన్లు వేసి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. జంతు ప్రేమికులు వాటికి ఆహారం అందజేయడంలో యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రులు,పాఠశాలలు, ఇతర బహిరంగ ప్రదేశాలకు వీధి కుక్కలు రానివ్వకుండా చూడాలన్నారు.

# తల్లిపాలే మొదటి టీకా



పులిచెర్ల, ఆగస్టు 3, ప్రభాతవార్త

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పులిచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పులిచెర్ల మండలంలో పులిచెర్ల అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులిచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్, సిడిపిఓ వాణిశ్రీ దేవి మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకి అమృతం లాంటివి చెప్పారు. పుట్టిన వెంటనే ఇచ్చే పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలియజేశారు. తల్లి పాలు ఇచ్చే సమయంలో తల్లి మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తెలియజేశారు. అలాగే పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రు పాలు ఇవ్వాలని మొదటిగా వచ్చే పాలు పసుపు పచ్చ రంగులో ఉంటాయని ఇందులో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఈ పాలు బిడ్డకు మొదటి టీకా లాంటివని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్తలు సుగుణ, శివరాణి, అంగన్వాడి కార్యకర్త ముబీన, గర్భవతులు బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# సత్వరం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం

పెనుమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల యుటిఎఫ్ అధ్యక్షుడు ఎం.మహేష్ ఓ ప్రకటనలో కోరారు. సత్వరం 12వ పిఆర్‌సి ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో వున్న 5 విడతల కరవు భత్యంను విడుదల చేయాలని, 2022 నుండి సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలకు సిబ్బంది విభజన చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి, ఐఆర్ ప్రకటించాలని, 5 విడతల కరవు భత్యం విడుదల చేయాలన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

# ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి

## - కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అధికార యంత్రాంగం ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 82 వినతిపత్రాలను అందజేశారు. అనంతరం వాటిని పరిశీలించి పరిష్కారంకై ఆయా శాఖల అధికారులకు అందించారు. ఈసందర్భంగా కడ పి.డి. మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చిన ప్రతి వినతిపత్రాన్ని అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలన్నారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి సాధ్యమైనంత త్వరగా ప్రజల సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలని ఆదేశించారు. ప్రజలకు వేగవంతంగా సేవలు అందించాల్సి ఉందని ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఎం పిఏ శ్రీకాంత్, కడ ఎపిడి శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

# కుప్పంలో బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రజలకు ప్రత్యేక బియ్యం పంపిణీ కోసం స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న శరవణ బిగ్ బజార్‌లో విక్రయ కేంద్రాన్ని ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ విక్రయ కేంద్రం ద్వారా ప్రజలకు కిలో స్టీమ్ బియ్యం రూ 52లు, పచ్చిబియ్యం కిలో రూ 50లకే విక్రయించడం జరుగుతుందన్నారు. బియ్యం అవసరమైన వారు తమ రేషన్‌కార్డు తీసుకునివచ్చి పది కిలోల దాకా బియ్యం కొనుగోలు చేయవచ్చన్నారు. రేషన్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబుచేస్తున్న మంచి ప్రజలకు చెప్పాలి

## -టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్



శాంతిపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న మంచిని ప్రజలకు చెప్పాలని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సాధికార సభ్యులు మొదలు పార్టీ కేడర్ అంతా ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలన్నారు. రోజుకు కనీసం ముప్పై కుటుంబాలను కలిసి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. ప్రజల సమస్యలు కూడా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారంకు కృషి చేయాలని సూచించారు. వందశాత ం మండలంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం పూర్తిచేయాలన్నారు. అలాగే రైతులకు సంబంధించిన గోకులం షెడ్ల మంజూరు, గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, కడ ద్వారా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎల్.జయరాంరెడ్డి, లోకేష్,మణి, గిరిధర్, నేతలు జనార్ధనరెడ్డి, చంద్ర, రాజేం ద్ర, శివశంకర్, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, మంజునాథ్, రుద్రప్ప, శకు ంతల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

## - పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

సి ఎం చ ం ద్ర బా బు నా య ు డు ఆదేశాలతోప్రజలసమస్యల పరిష్కారంకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం తెదేపా కార్యాలయంలో ఆయన జననాయకుడు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వారి అర్జీలను స్వీకరించారు. అప్పటికప్పుడు వాటి పరిష్కారంకై సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం అంశంను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుంటోందన్నారు. ప్రజలకు పారదర్శకతో జవాబుదారీతో కూడిన పాలన అందించడమే సిఎం చంద్రబాబు లక్ష్యం అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడ్తామన్నారు.

# రోడ్డు ఆక్రమణలు తొలగింపుకై కడ పి.డి.కి ఫిర్యాదు



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి 19వ వార్డులో రైల్వే స్టేషన్ రోడ్డు, యాక్సిస్ బ్యాంకు పక్క నుంచి కుప్పం జమీ ందారు ప్యాలెస్‌కు వెళ్లే రోడ్డు ఆక్రమణలు తొలగించాలని కడ పి.డి. వికాస్ మర్మత్‌కు 19వార్డు కౌన్సిలర్ జిమ్‌దాము, కౌన్సిలర్ జాకీర్ ఫిర్యాదు చేశారు. గతంలో నిత్యం ఈ రహదారిలో వంద కుటుంబాలు రాకపోకలు సాగించేవారని ప్రస్తుతం అక్కడ ఆక్రమ ణలు జరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ప్రజలకు ఈ దారి ఎంతో అనువుగా ఉండేదన్నారు. ప్రజల కోరిక మేరకు ఈ ఆక్రమణను తొలగించి చర్యలు చేపట్టాలని పి.డి.ని కోరారు.

# మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారికి రూ.80 వేలు జరిమానా

చిత్తూరుహెల్త్, ఆగస్టు 3 ప్రభాతవార్త:

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 8 మంది ద్విచక్రవాహనదారులకు సోమవారం 1వ అదనపు జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 80 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం పోలీసుల నిర్వహించిన తనిఖీల్లో 8 మంది ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని పోలీసులు సోమవారం కోర్టుకు హాజరు పరచగా కోర్టు ఒకొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

# రేపటి నుండి కన్నికల కొండపై ఆడికృత్తిక ఉత్సవాలు



పెనుమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

పెనుమూరు కన్నికల కొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం నుండి 8వ తేదీ వరకు ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు తారకరామశర్మ, అర్చకులు శివరామశర్మలు తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, 6వ తేదీ గురువారం భరణి అభిషేకాలు, 7వ తేదీ స్వామి వారికి ప్రీతిపాత్రమైన ఆడికృత్తిక, 8వ తేదీ వసంతోత్సవం, ధ్వజారోహన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి సేవలో పాల్గొనాలని వారు కోరారు.

# సొంత బొమ్మతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

బాలాయపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త: గత వైసిపి ప్రభుత్వంలో సొంత ఆస్తులైనట్లు జగన్మోహన్‌రెడ్డి ఫోటో వేసుకొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలం జార్లపాడులో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ 156 మంది రైతులకు రీసర్వే చేసిన భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రజల భూములు తన తాత రాజారెడ్డి వైనట్లు, రాజారెడ్డి రాజ్యం అయినట్లు జగన్ పట్టాదారు పాస్ పుస్తకాల మీద తన కుటుంబ సభ్యుల బొమ్మలు ముద్రించుకున్నాడు విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ రాజముద్రతో కూడిన భూమి యాజమాన్యపు హక్కు పత్రం మరియు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల గూర్చి, అభివృద్ధి గురించి పరితపిస్తున్నాడని అన్నారు. జార్లపాడు గ్రామంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని, కరెంటు, త్రాగునీరు, ఆరోగ్యశ్రీ కార్డులు, పక్కా గృహాలు ఇంకా పలు సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.



అనంతరం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కోటం బేడులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనల్లో వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, సొసైటీ అధ్యక్షులు సింగంశెట్టి భాస్కరరావు, దాసరి ప్రభాకర్ నాయుడు, టిడిపి నేతలు ముప్పాళ్ళ మాధవనాయుడు, కే రామచంద్ర నాయు, కూని శ్రీహరి, ఆది వెంకటకృష్ణారెడ్డి, చిత్తూరు ఈశ్వరయ్య, మారెళ్ళ వెంకటాద్రి, దాసరి కోటేశ్వరరావు, దాసరి రాజగోపాల్ నాయుడు, వేళ్ళ సురేంద్ర రెడ్డి, మల్లెమాల గోపి కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, ఎమ్మార్వో శ్రీనివాసులు, ఎంపీడీవో దాసరి నారాయణ, ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మున్సిపాల్టీ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని నాగరాజుపురంలో 28.33 లక్షల నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూప్రజలకు నాణ్యమైన రోడ్లు, మంచినీటి వసతులు, డ్రైనేజీ వ్యవస్థ కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తర్వాత 28 అభివృద్ధి పనులకు 9 కోట్ల రూపాయల నిధులతో చేపట్టగా అందులో 16 పనులు పూర్తయ్యాయని అందుకు గాను 5.78 కోట్లు వ్యయం అయ్యాయని అని చెప్పారు. మిగతా పనులు మరో నెల రోజుల్లో పూర్తవుతాయని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతోనే తాముపని చేస్తున్నామని ఇందుకు ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజి కిషోర్, పిట్ల సుబ్రహ్మణ్యం, దంతాల రవి, వెంకటేష్ యాదవ్, సేట్ రాజా, జోగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఇళూ పూరు పంచాయతీ పరిధిలోని పెరిమిటిపాడులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని, వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ, ఆశీర్వాదాలు తమకు మరింత బాధ్యతను పెంచుతున్నాయని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పాకం వెంకట సుబ్బయ్య, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, తాటిపర్తి శ్రీనివాస్‌రెడ్డి, మంగా నెల్లూరు వీర రాఘవన్, మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దారి చూపించండి మహాప్రభు



దొరవారిసత్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త: మండలంలోని యేకొల్లు గ్రామానికి చెందిన కొంత మంది రైతులు సోమవారం గ్రీవెన్స్ డేలో మండల తాసిల్దార్‌కి పలు అర్జీలు ఇచ్చారు. ఎదురుపట్టు రోడ్డు ప్రక్కన ఉన్న మా పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేకుండా కొంత మంది ఆక్రమించుకున్నారని తహసిల్దార్ రాజేంద్ర దగ్గర యేకొల్ల గ్రామానికి చెందిన రైతులు పొలాల్లోకి వెళ్లే దారిని కాపాడాలని మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, కొంత మంది రైతులు ఉన్నారు.

## పురిటి బిడ్డలకు తల్లిపాలు అమృతం లాంటిది

**- స్త్రీ శిశు సంక్షేమశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి**



వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త: పురిటి బిడ్డలకు తల్లిపాలు అమృతం లాంటిదని స్త్రీ-శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి తెలిపారు. వెంకటగిరి పట్టణం బంగారు పేట, బీసీ కాలనీలలోని అంగన్వాడి కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. బిడ్డ పుట్టిన గంట లోపల తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. తల్లిపాలు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి వస్తుందని తెలిపారు. అధిక ధరలకు లభించే డబ్బా పాలను పిల్లలకు ఇవ్వరాదని తెలిపారు. కొద్దిగ అయినా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. మంచి తిథులను ఎంచుకొని కొంతమంది సిజేరియన్ చేసుకుంటున్నారని ఇది మంచిది కాదని తెలిపారు. సిజేరియన్ చేసుకోవడం వల్ల ఆరు సంవత్సరాల ఆయుష్ తగ్గుతుందని చెప్పారు. ఏ సమయంలో బిడ్డ పుట్టిన మంచి జరుగుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలు, చిన్నారులు గర్భవతులకు పౌష్టికర ఆహారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. టీవీఎస్ సంస్థ వారు అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరు బాగుందని టిడిపి శంషాద్ బేగాన్ని అభినందించారు. గర్భవతులు, చిన్నారులు ఇక్కడ అంగన్వాడీ కేంద్రాలను ఉపయోగించు కుంటున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత బాయ్ మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ఇస్తున్న కోడిగుడ్డు పౌష్టికార ఆహారాన్ని ఇంటికి తీసుకెళ్లి తినాలి అన్నారు. చిన్నారులకు ఆహారం తినిపించేటప్పుడు చేతులను పరిశుభ్రంగా కడుక్కొని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శంషాద్ బేగం, డాక్టర్ సత్యప్రియ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

**కార్పొరేట్ ఆసుపత్రుల కన్నా...**

## మిన్నగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ ఆసుపత్రిలో కన్నా మిన్నగా వైద్య సదుపాయాలు ఉన్నాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉచిత భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు భోజనం కోసం ఇబ్బంది పడకుండా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా అందిస్తున్న ట్లు తెలిపారు. రోగులు వారితో వచ్చిన సహాయకులకు కూడా భోజనం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు 50వేల రూపాయలు విలువ కలిగిన ఇంజక్షన్‌ను ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సాయి, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు ఆనంద్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని 12వ వార్డు మల్లమ్మ గుడి వీధిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి అమలు చేస్తున్నారు సంక్షేమ పథకాలు గురించి కరపత్రాలు పంపిణీ చేసి ఎమ్మెల్యే వివరించారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, నాయకులు ఆనంద్, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

## తొండమాన్‌పురం ఆలయానికి గరుడ వాహనం



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాదుకు చెందిన భక్తులు గరుడ వాహనాన్ని విరాళంగా అందించారు. సుమారు రూ.6లక్షల విలువ కల్గిన గరుడ వాహనాన్ని వారు గ్రామోత్సవానికి ఉపయోగపడేటట్లు తయారు చేసారు. టిటిడి అనుబంధ సంస్థగా నిర్వహిస్తున్న తొండమాన్‌పురం గ్రామంలో ఆలయం వెలసింది. టిటిడిలో నిర్వహించే ప్రతి కార్యక్రమాలు, ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. హైదరాబాదుకు చెందిన రాజేంద్ర ప్రసాద్ వర్మ పలు మార్లు ఈ ఆలయాన్ని సందర్శించారు. ఇక్కడ ఉత్సవాల సమయంలో అవసరాలను గుర్తించారు. ఈ మేరకు వారు గరుడ వాహనాన్ని తయారు చేయించారు. దానిని కుటుంబసభ్యులు సుమన్‌శెట్టి, ప్రమీల, హర్షిత్, గుప్తా, సరితలతో కలసి వాహనాన్ని సోమవారం అందించారు. ఈ వాహనాన్ని టటెంపుల్ ఇన్స్పెక్టర్ సుధీర్, అనంద్‌లకు అందజేసారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు రమణస్వామి, సంపత్ స్వామి, గోపి, కృష్ణ, బాబుస్వామి గ్రామ పెద్ద కందాటి శేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి**
**- లడ్డూ ప్రసాదం తయారీ, నాణ్యతను స్వయంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే**
**- అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం**





పాకాల, ఆగస్టు 3 ప్రభాతవార్త: పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పురోగతిని అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు సమయం దగ్గర పడుతున్నందున ఆలయంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, ఇతర ప్రాథమిక మౌలిక సౌకర్యాలను పక్కాగా సమకూర్చాలన్నారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం, ఆలయంలో భక్తులకు పంపిణీ చేయనున్న లడ్డూ ప్రసాదం తయారీ విధానం, ప్రసాదం నాణ్యత, పరిశుభ్రత ఏర్పాట్లను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఈవో, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపాలి

**- ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య మల్లయ్య- ద్రవిడ వర్సిటీలో క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం !!**



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త: విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపి రాణించాలని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.సి.మల్లయ్య సూచించారు. సోమవారం వర్సిటీలోని ఓపెన్ ఎయిర్ స్టేడియంలో ద్రవిడియన్ క్రికెట్ లీగ్ -2026ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు ఆడడంతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు సైతం మెరుగవుతాయన్నారు. ఈసందర్భంగా జట్లను అభినందించారు. ఈ టోర్నీలో యుజి, పిజి విద్యార్థులు పది జట్లుగా పోటీల్లో పాల్గొంటున్నారు. పది రోజులపాటు ఈ లీగ్ పోటీలు జరుగుతాయని రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, పిడి నవీన్‌కుమార్, ఇతర డీన్‌లు, హెచ్ఒడిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా గంగమాంబ వార్షికోత్సవాలు



రామకుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త మండల కేంద్రంలో వెలసి ఉన్న గంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలును నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మ వార్లకు అభిషేకం, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి పచ్చగెరిగ శిరస్సును సుంద రంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో విహరింపజేశారు. సల్లాపురెమ్మ, గంగమ్మ, ఉత్సవాలను ఊరేగించారు. భక్తాదులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతిలిచి మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

## మాజీ క్రికెట్ ప్లేయర్లకు ఘన సన్మానం




పలమనేరు, ఆగస్టు 3 ప్రభాతవార్త: పలమనేరులో పాత తరంకు చెందిన 70 ఏళ్ళు పైబడ్డ మాజీ క్రికెట్ ప్లేయర్లను సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. కళాశాల క్రికెట్ కోచ్ బాలాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపిపి ఆర్.రాజేంద్ర కేప్టన్‌గా వ్యవహరించేవారు. మాజీ క్రికెటర్లు మాట్లాడుతూ అప్పట్లో జిల్లాలోనే కాదు రాయలసీమలోనే పలమనేరు క్రికెట్ బ్యాచ్ అంటే ప్రత్యేక అభిమానం ఉండేది. పలమనేరు క్రికెట్ బ్యాచ్ అంటే మదనపల్లె, తిరుపతి బ్యాచ్‌లు కూడా బయపడేవారు. ప్రతి శనివారం ఆదివారం కళాశాల ఆవరణలో క్రికెట్ మ్యాచ్ జరిగేది. పలమనేరులో అప్పట్లో జనాభా తక్కువ అయినా దాదాపు 2 వేల మంది మ్యాచ్ చూడడానికి వచ్చే వారు. 1983లో పంచాయతీ ఆఫీస్ వద్ద బ్లాక్ అండ్‌వైట్ స్క్రీన్‌పై మ్యాచ్ లైవ్‌లో చూసేవారు. అప్పట్లో లోకనాథం, సుధాకర్, నూర్‌బాషా, ఇక్బాల్, రమేష్, సోమ, చందు. గురురాజారావు, రామచంద్ర, దినకర్, క్రిష్ణమూర్తి, శివశంకర్ తదితరులు క్రికెట్ మ్యాచ్‌లో సత్తా చాటేవారు. ఐతే అప్పటికీ ఇప్పటికీ క్రికెట్ మ్యాచ్‌లు అడడంలో చాలా మార్పులు వచ్చాయి. పలమనేరు నుండి కాకపోయినా ఇతర ప్రాంతాల నుండి ఎంతో మంది జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి రంజీ మ్యాచ్‌లతో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆడేవారు. అప్పట్లో క్రికెట్ మ్యాచ్‌పై ఉన్న ఆదరణ, అభిమానం వల్ల ఈ రోజుకు కూడా తాము ఫిట్‌నెస్‌తో ఉన్నామని తమకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## రైతులు తగు జాగ్రత్తలు వహించాలి



వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త: పంట కోతలు పట్ల రైతులు తగు జాగ్రత్తలు వహించాలని ఆనసూయ తెలిపారు. మండలం నందు పంటకోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల సాయి శిక్షణ కార్యక్రమంను స్థానిక సహాయ వ్యవసాయ సెక్షన్ ఇచ్చారు. ఇందులో భాగంగా ఖరీఫ్ 2026 పంట కాలంలో ప్రస్తుతం సాగు చేయుచున్న వరి, వేరుశనగ పంటలకు సంబంధించి పంట కోత ప్రయోగములలో భాగంగా ఫారం1, ఫారం 2 నా యొక్క ఆవశ్యకతను, దిగుబడి వివరముల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి పి.సుజాత, డివిజనల్ సహాయ గణాంక అధికారి స్థానిక గణాంక అధికారి మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్పి రామ్మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల రక్షణకు రక్షణ కల్పించాలి : ఎంపీ



వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త: భారీ వర్షాలు, వరదలు, వడగాల్పులు, తుఫానులు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల అసంఘటిత, దినసరి కూలీలపై పడుతున్న ప్రభావం, వారికి సామాజిక భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సహాయక చర్యలు ఏ విధంగా చేపడుతున్నారో తెలపాలని కోరారు. దీనిపై కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సంభవిస్తున్న తీవ్ర వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ నమోదు చేస్తోందని మంత్రి తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించి వివిధ రంగాల్లో సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర పర్యావరణ శాఖ జాతీయ వాతావరణ అనుసరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వడగాల్పుల నుంచి కార్మికులను రక్షించేందుకు కేంద్ర కార్మిక శాఖ దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ అడ్వైజరీలు జారీ చేస్తోందని, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వెంటనే జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. భారత వాతావరణ శాఖ దేశంలోని పరిశోధనా సంస్థలతో కలిసి వాతావరణ పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న హీట్‌వేవ్ అడ్వైజరీలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు స్వాగతించదగినవే కానీ ప్రభావిత కార్మికులకు ఉపాధి భద్రత, సామాజిక రక్షణ, తక్షణ ఆర్థిక సాయం కల్పించే సమగ్ర విధానాలు కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

బాలాయపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త : బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల నాలుగో తేదీ మంగళవారం తిరుపతికి చెందిన టాటా క్యాన్సర్ ఇనిస్ట్యూట్ వారు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు అని వైద్యాధికారిని డాక్టర్ లియోనా తెలిపారు. క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌ను స్థానికల్లో వచ్చి పరీక్షలు చేసుకోవచ్చని వివరించారు. 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మండలాల్లో ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

## మత్స్యకారుల నష్టాలపై అవగాహన



వాకాడు, ఆగస్టు 3 ప్రభాతవార్త: దురాజపట్నం పంచాయతీ కొండూరుపాళ్లెం గ్రామంలో ఎల్‌ని నో 2026- 27 కోస్తా మత్స్యకారులకు ప్రభావం పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎల్ నినో కలిగే నష్టాలు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలు వేట పద్ధతిలో మార్పులు జీవనోపాధి ఆర్థిక సహాయం గురించి వివరించి ప్రభుత్వం సహాయం, ముందస్తు హెచ్చరికల గురించి మత్స్యకారుల సమస్యపై మత్స్యకారులకు సేవను ఉపాధి గురించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ వివరించారు. ఆయనతో పాటు బొమ్మలు ఏకంబరం, అప్పంగారి జయపాల్, ఎం నరసింహా, ఎఫ్‌డిఓ రఘు, కొండూరు గ్రామ కాపులు, పెద్దలు, గ్రామస్తులు, కోడూరు ఏడుకొండలు, ఇతర మత్స్యకారు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



తడ, ఆగస్టు 3 ప్రభాతవార్త : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తడ మండలం కారూరు అంగన్వాడి కేంద్రం నందు సోమవారం అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ గర్భవతులకు బాలింతలకు చిన్నపిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. వారు మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు ముర్రిపాలు త్రాగించాలని బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల వరకు తల్లిపాలు కచ్చితంగా త్రాగించాలని తల్లి పాలల్లో పోషకాలు సమతుల్యంగా ఉంటాయని బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అదేవిధంగా తల్లిపాలు శిశువు రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శారీరక మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతుందని బాలింతలు పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వివరించారు ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ బి కళ్యాణి, ఏఎన్ఎం శ్రీదేవి, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య!

తడ, ఆగస్టు 3 ప్రభాతవార్త: తడ మండలం భీములవారిపాలెంలో సోమవారం విషాద ఘటన చోటు చేసుకుంది గ్రామానికి చెందిన మస్తాన్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడే ముందు సెల్ఫీ వీడియో రికార్డ్ చేసి అనంతరం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అప్పులు బాధలు తట్టుకోలేక దారుణ నిర్ణయం తీసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు చక్రాల స్కూటీమోడ్ అందజేత



తొట్టంబేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త : తొట్టంబేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజనాయుడు అన్నారు. తొట్టంబేడు మండలం చిన్న కన్నలి గ్రామంలో సోమవారం ఇంటింటి పర్యటనలో భాగంగా ఒక వికలాంగునికి మూడు చక్రాల మూడు చక్రాల స్కూటీమోడ్‌ని ప్రభుత్వం తరఫున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది టిటిడి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగమన్నారు. బండి విలువ సుమారు ఒకటిన్నర లక్ష రూపాయలన్నారు. ఈ బండి వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా తిరగగలరని, జీవనోపాధికి అవకాశం ఉంటుందని మునిరాజనాయుడు వివరించారు. కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లిన మునిరాజ నాయుడు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరంగా వివరించారు. అర్హులైన వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎలాంటి పత్రాలు అవసరం అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షులు మునిరాజనాయుడు అత్యంత సన్నిహితుడైన 9భూతుల ఇంచార్జ్ లెక్కల మురళినాయుడు, కమల్‌నాథ్, బూత్ ఇన్‌చార్జ్‌లు మురళి, మాధవి, గోపీ, గురప్ప, సునీల్ గ్రామంలోని మండల నాయకులు రామనాయుడు, చంద్రారెడ్డి, గోవర్ధన్ నాయుడు, శంకర్ నాయుడు, మునిరాజా, చలపతి, ప్రసాద్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తక్కువ ధరలకు బియ్యం విక్రయాలు ప్రారంభం

**-వర్షాభావ పరిస్థితులలో ప్రభుత్వ ముందస్తు చర్యలు -జిల్లాలో 28కేంద్రాలలో సబ్సీడి బియ్యం విక్రయం**

తిరుపతిరూరల్, ఆగస్టు3 ప్రభాతవార్త: వర్షాభావ పరిస్థితుల్లో పెరుగుతున్న ధరలకు చెక్ పేట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యంతో ఆగస్టు 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరల బియ్యం విక్రయాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో 28కేంద్రాల ద్వారా బియ్యం విక్రయాలు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం స్థానిక రైతుబజారులో సబ్సిడి బియ్యం విక్రయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల ఒత్తిడిని తగ్గించేందుకు సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో రెండు రకాల ఫైన్ వెరైటీ బియ్యాన్ని తక్కువ ధరకే అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని, రైతుబజారులలో రైస్ మిల్లర్ కేంద్రాల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండింటిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఏఎస్ఓ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.